క్లుప్తంగా

రక్తదానం చేసి ప్రాణ దాతలు కావాలి

కోవెలకుంట్ల: రక్తం అవసరమై ఆపదలో ఉన్న వారికి సకాలంలో రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ దస్తగిరి పిలుపునిచ్చారు. పట్టణ శివారులోని జ్యోతి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో 72 మంది విద్యార్థుల తల్లిదండ్రులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సవిత్నాథ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సింధూరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణ పనులను పరిశీలించిన డీఈ

బేతంచెర్ల: పట్టణంలోని గొరిపేటలో ఆంజనేయస్వామి ఆలయంలో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో రూ.1.50 కోట్లతో పునర్నిర్మిస్తున్న వినాయక, వేణుగోపాల, మాధవ, కాలక్షేప మండపం, ఉత్తర ద్వార ఆలయ నిర్మాణ పనులను దేవదాయ శాఖ డీఈ ప్రసాద్, ఏఈ రవి కుమార్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మద్దిలేటి, ఆలయ కమిటీ సభ్యులతో ఆలయ నిర్మాణ పనుల పురోగతిపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ గుండా జగన్, కమిటీ సభ్యులు మారుతి కృష్ణ, బుగ్గన విశ్వనాథ్ రెడ్డి, హుసేన్‌రెడ్డి, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

పైపులైన్ ఏర్పాటుకు భూమి పూజ

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఇంటింటికీ నీటి సరఫరా చేసేందుకు పైప్‌లైన్ ఏర్పాటుకు జల్‌జీవన్ మిషన్ నిధులు రూ.69 లక్షలు మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆకుమల్ల వైఎస్సార్‌సీపీ నాయకులు గౌరిగారి కిరణ్ కుమార్ రెడ్డి నూతన పైపులైన్ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏఈ ఉపేంద్రా రెడ్డి, నాయకులు గౌరిగారి వెంకటేశ్వర్ రెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ ఉస్సేని, సూరయ్య, రహమతుల్ల, కంబగిరి రాముడు, మహేశ్వర్ రెడ్డి, మద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కోవెలకుంట్ల: సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలను శనివారం తహసీల్దార్ పుష్పకుమారి పరిశీలించారు. ఆయా కేంద్రాల పరిధిలో తాగునీటి వసతి, బాత్‌రూమ్, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు.

సివిల్ సప్‌లై గోదాము తనిఖీ

స్థానిక సివిల్ సప్‌లై గోదామును తహసీల్దార్ పుష్పకుమారి తనిఖీ చేశారు. వచ్చే నెల 1వ తేదీ నుంచి ప్రజా పంపిణీకి సంబంధించిన బియ్యం, కందిపప్పు, చక్కెర తదితర నిత్యావసర సరుకులను ఆయా గ్రామాల డీలర్లకు సరఫరా చేశారా లేదా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇమ్రాన్, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు

బనగానపల్లె : ఎన్ఆర్ఈజీఎస్ స్టేట్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికైన అవుకు మండలం సింగనపల్లె గ్రామానికి చెందిన ముక్కమళ్ల పుల్లారెడ్డి శనివారం స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యే కాటసానిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రామిరెడ్డిని పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయులు గుండం సూర్యప్రకాష్ రెడ్డి, పోచా శీలారెడ్డి, స్థానిక నాయకులు పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రి బుగ్గన సమక్షంలో న్యూ ఇయర్ వేడుకలు

డోన్ : నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని ఆర్థిక శాఖ మంత్రి, డోన్ ఎమ్మెల్యే బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జనవరి 1వ తేదీన ప్రజలకు అందుబాటులో ఉంటారని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. మంత్రి బుగ్గన స్వగృహంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో శనివారం ఆయన మాట్లాడారు. కొత్త సంవత్సరం వేడుకలు స్థానిక సాయి ఫంక్షన్ హాల్‌లో మంత్రి సమక్షంలో ఏర్పాటు చేశామని, డోన్, ప్యాపిలి, బేతంచెర్ల మండలాల ప్రజలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్టు పసాద్, యువజన విభాగం మండల, పట్టణ అధ్యక్షులు దొరపల్లె చిరంజీవి, ఆర్ఈ రాజవర్ధన్, నాయకులు మహేశ్వరరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, మల్యాల భాస్కర్‌రెడ్డి, సతీష్, కుమ్మరి రాజు, నాగిశెట్టి, శివ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో గ్రామాలు

ప్యాపిలి: మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో డోన్ నియోజకవర్గం పరిధిలోని గ్రామాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయని రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ అన్నారు. మండల పరిధిలోని ఏనుగుమర్రి, మాదినేనిదొడ్డి, వెంగళాంపల్లి, ఓబులదేవరపల్లి, సిద్దనగట్టు, కొమ్మేమర్రి తదితర గ్రామాల్లో శనివారం ఆయన 'మనకోసం బుగ్గన' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలతో మమేకమై మంత్రి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిపై అవగాహన కల్పించారు. దశాబ్దాలుగా జరగని అభివృద్ధి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలలో జరిగిందన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు వంటి సౌకర్యాలను కల్పించిన ఘనత మంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఏనుగుమర్రి, వెంగళాంపల్లి సర్పంచ్‌లు కరణం మోహన్, రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు బోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాడు వెలవెల...నేడు కళకళ !

- గతంలో నిలిచిపోయిన పార్క్‌ను రూ. 35లక్షలతో అభివృద్ధి
- సేదతీరుతున్న బేతంచెర్ల పట్టణ ప్రజలు
- కేరింతలు కొడుతున్న చిన్నారులు



చిన్నారులు ఆడుకోవడానికి ఏర్పాటు చేసిన ఆట వస్తువులు



ఆకర్షణీయంగా పార్కు ముఖద్వారం



పార్కు మధ్యలో ఓపెన్ థియేటర్



బేతంచెర్ల: డోన్‌ను మోడల్ నియోజకర్గంగా తీర్చిద్దిడమే లక్ష్యంగా ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముందుకు సాగుతున్నారు. డోన్, బేతంచెర్ల, ప్యాపిలి మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లోనూ రూ. కోట్లు వెచ్చించి మౌలిక వసతులు కల్పించారు మంత్రి బుగ్గన. డోన్ నియోజకర్గంలో గతంలో ఎన్నడూ జరగని అభివృద్ధి కేవలం నాలుగేళ్లలో జరిగిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అర్హులందరికీ గృహాలు, ప్రతి గ్రామంలో రోడ్ల నిర్మాణాలు, దేవాలయాల అభివృద్ధికి చర్యలు చేపట్టారు. బేతంచెర్ల పట్టణంలోని ఎన్జీఓ కాలనీలో ఏళ్ల క్రితం పార్క్ నిర్మాణం ప్రారంభించారు. అయితే ఏ మాత్రం ముందుకు సాగలేదు. పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తేవాలనే ఆలోచనే పాలకులకు రాలేదు. పట్టణ ప్రజలకు నిరాశే మిగిలింది. అయితే మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో గతేడాది రూ. 35 లక్షలు మంజూరు చేయించారు. దీంతో పార్క్ సుందరంగా మారింది. పార్కులో చిన్నారులు ఆడుకునేందుకు ఆట వస్తువులను ఏర్పాటు చేయడమే కాకుండా, గార్డెన్, ఓపెన్ థియేటర్, వాకింగ్ ట్రాక్, తూర్పు గోదావరి జిల్లా కడియం నుంచి తెచ్చిన వివిధ రకాల పూల మొక్కలు నాటడంతో ఆహ్లాదకరంగా మారింది. నవంబర్ 30వ తేదీన మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పార్కును ప్రారంభించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఉదయం, సాయంత్రం పట్టణ ప్రజలు సేదతీరుతున్నారు. ఇక సాయంత్రం చిన్నారులు, మహిళలతో పార్క్ కిటకిటలాడుతుంది. చిన్నారులు కేరింతలు కొడుతూ సంతోషంగా ఆటలాడుతున్నారు. తల్లిదండ్రులు చిన్నారుల సంతోషాన్ని చూసి మురిసి పోతున్నారు.

పార్క్ అందుబాటులోకి రావడం సంతోషకరం



కనీసం సేదతీరేందుకు పార్క్‌లేదని అసంతృప్తి ఉండేది. మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో పార్క్ అందుబాటులోకి తీసుకురావడం సంతోషంగా ఉంది. అప్పుడప్పుడు పిల్లలతో కలిసి పార్క్‌కు వెళ్తుంటా. చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. పిల్లలు చాలా సంతోషంగా గడపడం ఎంతో తృప్తినిస్తుంది. వాకింగ్ ట్రాక్‌తో పాటు రక రకాల పూల మొక్కలు, చెట్లు పచ్చదనంతో స్వాగతం పలుకుతున్నాయి. మంత్రి బుగ్గనకు కృతజ్ఞతలు.

– మహమ్మద్ గౌస్, బేతచెర్ల

మంత్రి బుగ్గన చొరవతోనే పార్క్ అభివృద్ధి



ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి డోన్ నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ మౌలిక వసతులు కల్పించారు. బేతంచెర్ల పట్టణంలో ఎప్పుడో నిలిచిపోయిన పార్క్‌ను మంత్రి బుగ్గన ప్రత్యేక చొరవతో అభివృద్ధి జరిగింది. పట్టణ ప్రజలు, చిన్నారుల సౌకార్యర్థంగా ఉంది. సాయంత్రం వేళ కనీసం సేదతీరేందుకు పార్క్ లేదని పట్టణ ప్రజలకు అసంతృప్తి ఉండేది. పార్క్‌కు నిధులు మంజూరు చేయించి ప్రజలకు అందుబాటలోకి తెచ్చిన మంత్రి సాయం మరువం.

– ఇబ్రహీమ్, కౌన్సిలర్

న్యూ ఇయర్ వేడుకలకు ఎమ్మెల్యే కాటసాని అందుబాటులో ఉండరు

బనగానపల్లె : ప్రజలకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముందస్తుగా 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024న జనవరి 1వ తేదీ న్యూ ఇయర్ వేడుకులకు అనివార్యకారణాల మూలంగా అందుబాటులో ఉండడంలేదన్నారు. ప్రజలతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు కాటసాని అభిమానులు, అధికారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు. కొత్త ఏడాది రోజున ప్రశాంత వాతావరణంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా వేడుకలు నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే కాటసాని కోరారు.

పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత శిఖరాలు



ఎస్ఐగా ఎంపికైన ఉసేన్‌వలితోపాటు ఆయన తండ్రిని సన్మానిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: కృషి, పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని కుందూ పోరాట సమితి అధ్యక్షుడు కామని వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఐ ఫలితాల్లో మండలంలోని కలుగొట్లకు చెందిన ఉసేన్‌వలి ఎస్ఐ పోస్టు సాధించాడు. ఈ మేరకు శనివారం స్థానిక రోటరీక్లబ్ భవనంలో ఉసేన్‌వలిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సుధాకర్, ఓబులేసు, అందనం దేవరాజు, కత్తి ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ప్యాపిలి: మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బాధితులకు శనివారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొర్రా మల్లికార్జునరెడ్డి తదితరుల చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. హుసేనాపురం, పెద్దపోదిళ్ల, జలదుర్గం, కలచట్ల తదితర గ్రామాలకు చెందిన అనూష, కమతం భాస్కర్ రెడ్డి, ఉమామహేశ్వరి, రామకృష్ణ తదితరులకు వరుసగా రూ. 30 వేలు, రూ. 1.7 లక్షలు, రూ. 45 వేలు, రూ. 1 లక్ష ప్రకారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ వివిధ అనారోగ్య సమస్యల కారణంగా బాధితులు సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి చొరవతో ఈ ఆర్థిక సాయం మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రాజా మురళీకృష్ణ, పర్వతం మధు, బోరెడ్డి రఘు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు సరఫరా చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న చలం రెడ్డి

బేతంచెర్ల: నూతన సంవత్సరం జనవరిలో బేతంచెర్ల పట్టణానికి వాటర్ గ్రిడ్ పథకం కింద గోరుకల్లు రిజర్వాయర్ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తామని నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయంలో కౌన్సిల్ సర్వసభ్య సమావేశం చైర్మన్ చలం రెడ్డి అధ్యక్షతన కమిషనర్ రమేష్ బాబు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో చేపట్టే అభివృద్ధి పనులను, 2024–25 బడ్జెట్ వివరాలు, రూ.45 కోట్లతో ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి చేపట్టే పైపులైన్ నిర్మాణ పనులను కమిషనర్ రమేష్ బాబు వివరించారు. నగర పంచాయతీ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుగా ఖాళీగా ఉన్న అవుట్ సోర్సింగ్ పోస్టుల భర్తీ, ఆయా కాలనీల్లో చేపట్టె అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు చెల్లించాల్సిన బిల్లులకు సభ్యుల ఆమోదంతో తీర్మానం చేశారు. కార్యక్రమంలో టీపీ అంజద్ బాషా, ఏఈలు శేఖర్, గోపాల్, నగర పంచాయతీ వైస్ చైర్మన్లు నాగ వెంకటేశ్వర్లు, పర్వీన్ కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, ఇబ్రహీం, మధు, శకుంతల, నాగజ్యోతి, షేక్ ముబీనా, మహేశ్వరీ, యంగమ్మ, హుసేన్‌బీ, ఆబీదా పాల్గొన్నారు

ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

- డీఎస్పీ శ్రీనివాసరెడ్డి



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

డోన్ టౌన్ : ప్రజల స్వేచ్ఛకు భంగం కలిగిస్తే ఎంతటి వారైన ఉపేక్షించమని, కఠిన చర్యలు తప్పవని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. స్థానిక సీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేర సమాచారాన్ని డీఎస్పీ వివరించారు. గత మూడేళ్లలో సబ్ డివిజన్ పరిధిలో నేరాల సంఖ్య తగ్గముఖం పట్టినట్లు తెలిపారు. ముఖ్యంగా దోపిడీ, దొంగతనాలు, హత్యలు, అల్లర్లు, కిడ్నాప్‌లుతో పాటు మట్కా, జూదం, మద్యం, మత్తు పదార్థాల రవాణ, వినియోగం, సరఫరా తదితర నేరాలు తగ్గాయన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది అంకిత భావంతో విధులు నిర్వహించినందునే నేరాల సంఖ్య తగ్గాయన్నారు. డోన్ సమీపంలోని జాతీయ రహదారిపై సెల్ ఫోన్ల కంటైనర్ చోరీ, సిగరెట్ల లారీ లూటీ, బ్లేడ్ల దొంగతనం లాంటి కేసుల్లో పురోగతి సాధించి నిందితులను అరెస్టు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. బేతంచెర్లలో చోటు చేసుకున్న కిడ్నాప్ కేసును ఛేధించి రూ.3కోట్లు రికవరీ చేశామన్నారు. దొంగతనాలకు సంబంధించి మొత్తం 82 కేసుల్లో రూ.1.51 కోట్లు సొత్తు, డబ్బులు పోగా ఇందులో దొంగలను గుర్తించి ఇప్పటి వరకు రూ.1.15 కోట్ల మేర రికవరీ చేశామన్నారు. రోడ్డు ప్రమాదాలు మాత్రం కొద్దిగా పెరిగాయని, వీటి నివారణ కోసం ఓపెన్ ప్లేస్ డ్రికింగ్, డ్రంక్ అండ్‌డ్రైవ్, రాష్ డ్రైవింగ్ తదితరవాటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

నూతన సంవత్సర వేడుకలను యువత, ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని, ఇతరులకు ఇబ్బంది కల్గించే విధంగా వ్యవహరించరాదని డీఎస్పీ శ్రీనివాసరెడ్డి సూచించారు. బైకు రైడింగ్‌లు, సైలెన్సర్లు లేకుండా అధిక శబ్దాల చేస్తూ తిప్పితే వాటిని సీజ్ చేస్తామని హెచ్చరించారు. పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఆదివారం మూసివేసి రాకపోకలను బంద్ చేస్తున్నామన్నారు. సోమవారం తెల్లవారు జామున రాకపోకలను అనుమతిస్తున్నట్లు ఆయన తెలిపారు.

నేరాలు, ప్రమాదాలు తగ్గాయి

బేతంచెర్ల: మండలంలో 2023 సంవత్సరంలో నేరాలు, ప్రమాదాల సంఖ్య తగ్గుముఖం పట్టినట్లు, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ప్రియతం రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలను వెల్లడించారు. నూతన సంవత్సరం వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని, ఎదైనా వేడుకలు నిర్వహించాలంటే పోలీసుల అనుమతి తప్పనిసరన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల, క్లస్టర్ కమిటీల నియామకం

కోవెలకుంట్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బనగానపల్లె నియోజకవర్గానికి సంబంధించి మండల, క్లస్టర్ కమిటీలను నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శనివారం రాత్రి ప్రకటన విడుదల చేసింది. వైఎస్సార్‌సీపీ కోవెలకుంట్ల మండల అధ్యక్షుడిగా బీవీ నాగార్జునరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎల్వీ సుధాకర్‌రెడ్డి, అక్బర్‌బాషా, ప్రధాన కార్యదర్శులుగా ఎం. నాగేశ్వరరెడ్డి, ఆర్ రాజేంద్రారెడ్డి, బీ. భాస్కర్‌రెడ్డితోపాటు కమిటీ సభ్యులుగా మరో 22 మందిని నియమించారు.

- కొలిమిగుండ్ల మండలానికి సంబంధించి అధ్యక్షుడిగా అంబటి గుర్విరెడ్డి, ఉపాధ్యక్షులుగా కామిని తిమ్మారెడ్డి, ఓబులేసు, ప్రధాన కార్యదర్శులుగా బాచం మహేశ్వరరెడ్డి, వెంకటసుబ్బయ్య, కంబయ్యతోపాటు 22 మంది కమిటీ సభ్యులను నియమించారు.
- సంజామల మండల అధ్యక్షుడిగా మల్కిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా కే. వెంకటసుబ్బయ్య, పి. మోహన్, ప్రధాన కార్యదర్శులుగా ఉసేన్‌బాషా, గంగాధర్‌రెడ్డి, రమణారెడ్డిలతో పాటు 22 మందికి కమిటీలో చోటు దక్కింది.

డోన్ నియోజకవర్గం....

డోన్ రూరల్ : వైఎస్సార్‌సీపీ బేతంచెర్ల మండలం అధ్యక్షుడిగా కె.తిరుమలేశ్వరారెడ్డి, ఉపాధ్యక్షులుగా తలారి ఎల్లనాయుడు, జీ.నాగేశ్వరరెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఎం.రామకృష్ణ, ఎం. తిమ్మరాజు, ఆర్.సుబ్రహ్మణ్యం ఎన్నికయ్యారు. అదేవిధంగా 21 మంది సభ్యులుగా ఎంపికయ్యారు. బేతంచెర్ల నగర పంచాయితీ అధ్యక్షుడిగా ఎం.ఖాజాహుసేన్, ఉపాధ్యక్షులుగా కటారుకొండ మద్దిలేటి, ఉయ్యాలవాడ భాస్కర్ ఎన్నికయ్యారు. వీరితో పాటు 24మంది సభ్యుల నియామకం జరిగింది.

- డోన్ మండల అధ్యక్షుడిగా టి.రామచంద్రుడు, ఉపాధ్యక్షులుగా సుధాకర్‌రెడ్డి, రామాంజినేయులు ఎన్నికయ్యారు. 5మంది సభ్యులుగా ఎన్నికయ్యారు. డోన్ మున్సిపాలిటీ కమిటీ అధ్యక్షుడిగా కురుకుంద్‌హరి, ఉపాధ్యక్షులుగా మిట్టారవి, మద్దిలేటినాయుడు, 24మంది సభ్యులు ఎన్నికయ్యారు.
- ప్యాపిలి మండల అధ్యక్షుడిగా జీ.క్రిష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా పి.చంద్రశేఖర్‌రెడ్డి, నరసింహరెడ్డి ఎన్నికయ్యారు. వీరితో పాటు 24మంది సభ్యుల నియామకం జరిగింది.

పీఆర్‌టీయూ క్యాలెండర్లను ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె రూరల్ : స్థానిక పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం కార్యాలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో పీఆర్‌టీయూ 2024 నూతన సంవత్సర క్యాలెండర్లను శనివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డితో పాటు ఆయన సోదరుడు కాటసాని ప్రసాదరెడ్డి, కుమారుడు కాటసాని ఓబులరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. పీఆర్‌టీ యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంపుల్లారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దస్తగిరి, కార్యదర్శి రఘునాథ్, గౌరవ సలహాదారులు షాషావలి, జిల్లా కౌన్సిలర్ అబ్దుల్‌షరీఫ్, హెచ్‌ఎం భాస్కర్ రెడ్డి తదితర నాయకులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్య పెట్టేందుకు టీడీపీ కుట్రలు

- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : ప్రజలను మభ్యపెట్టేందుకు టీడీపీ కుట్రలు పన్నుతోందని, వారి కుతంత్రాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల అందిచండం ద్వారా ప్రజలు సోమరులుగా తయారు చేస్తూ రాష్ట్రాన్ని శ్రీలంక, పాకిస్తాన్ చేస్తున్నారని గగ్గోలు పెట్టిన టీడీపీ నాయకులు మేం అధికారంలోకి వస్తే వైఎస్సార్‌సీపీ కంటే మెరుగైన పథకాలను అమలు చేస్తాని చెప్పడం హేయమన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శనివారం పట్టణంలోని సచివాలయ–3 పరిధిలోని ఆర్యవైశ్య భవనం, పోలీసు సర్కిల్ కార్యాలయం వీధి, ఆస్థానం రోడ్డు తదితర ప్రాంతాల్లో సోదరుడు సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు కాటసాని ప్రసాదరెడ్డి, కుమారుడు కాటసాని ఓబులరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాటసాని విస్తృతంగా పర్యటించారు. నాలుగున్నరేళ్లలో ఆయా కుటుంబాలకు సంక్షేమ పథకాల ద్వారా చేకూరిన లబ్ధికి సంబంధించిన బుక్‌లెట్ పంపిణీ చేయడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీల్లో 99శాతం అమలు చేసిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కరోనా కష్టకాలంలోనూ ప్రజలకు సంక్షేమ పథకాలను అందించడంలో దేశానికే సీఎం వైఎస్ జగన్ ఆదర్శంగా నిలిచారన్నారు. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పథకాలు అందాలంటే ఏళ్ల తరబడి వేచి చూడల్సిన దుస్థితి ఉండేదని, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనలో గ్రామ సచివాలయ, వలంటీర్ల వ్యవస్థల ద్వారా అర్హులందరికీ న్యాయం చేస్తున్నామన్నారు. సంక్షేమ పథకాలు ఇలాగే కొనసాగాలంటే పేదల సంక్షేమ కోసం నిర్విరంగా కృషి చేస్తున్న వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమలో జెడ్పీటీసీ లక్ష్మీసుబ్బమ్మ, మార్కెట్‌యార్డు చైర్మన్ దీవెనమ్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు డాక్టర్ రవికుమార్, గఢంశెట్టి వేనుగోపాల్, శ్రీరామ వెంకట సుబ్రహ్మణ్యం, నూకల వెంకటసుబ్బయ్య, డి వెంకట సుబ్బయ్య, పీఎస్ఎస్ సత్యనారాయణ, నూకల విజయకుమార్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, గుండా రవికుమార్, గుండా శ్రీనివాసులు, గోపాల్, శివ చంద్రయ్య, చక్రపాణి, సురేంద్ర బాబు,రవి, శివ, జనార్ధన్, సాగర్ ఫణిభూషణ్, వైఎస్సార్‌సీపీ ముస్లిం మైనార్టీ నాయకులు అత్తార్‌జాహెద్, అనిల్, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, మహబూబ్‌వలి, ఎవరెస్టుబాబు, అల్లివుశేన్, బాలపక్కిర, కిశోర్ సురేష్, నీలిశ్రీనివాసులు, ఖనిక్, యూనుస్, కృష్టారెడ్డి సుదర్శన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, అబ్దుల్‌ఖైర్, అబ్దుల్‌ఫైజ్, ఎంపీడీఓ శివరామయ్య, ఎంఈఓ స్వరూప, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీయడమే లక్ష్యం



షటిల్ టోర్నమెంట్ క్రీడాకారులతో రాజేష్



రామాపురంలో షటిల్ ఆడుతున్న

డోన్: క్రీడాకారుల నైపుణ్యాన్ని వెలికితీసి ఉత్తమంగా తీర్చిదిద్దడమే ఆడుదాం .. ఆంధ్ర కార్యక్రమం లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. స్థానిక బుగ్గన శేషారెడ్డి ఇండోర్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రెండురోజుల పాటు జరిగే షటిల్ టోర్నమెంట్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ ఎంతోమంది ప్రతిభ కలిగిన క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. వీరికి తగిన విధంగా శిక్షణ ఇవ్వగలిగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోనూ సత్తా చాటుతారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కోట్రికె హరికిషన్, జాకీర్‌హుసేన్, కౌన్సిలర్ నాగేంద్ర పాల్గొన్నారు.

అవుకు: క్రీడతో మానసిక ఉల్లాసంతో పాటు చదవులపై ఏకాగ్రత ఏర్పడుతుందని తహసీల్దార్ పోతుల ప్రాసాద్ బాబు తెలిపారు. మండల కేంద్రం అవుకు సచివాలయం–2తోపాటు గుండ్లశింగవరం, సింగనపల్లె, రామాపురం, రామాపురం గ్రామాలలో శనివారం ఆడుదాం ఆంధ్రా క్రీడలు నిర్వహించారు. ఆయా గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలల మైదానాలలో కోకో, కబడ్డీ, క్రికెట్, వాలీబాల్ పోటీలు ఉల్లాసంగా సాగాయి. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్ రెడ్డి, ఎంఈఓలు శ్రీధర్‌రావు, వెంకటేశ్వర్ రెడ్డి, ఏఓ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లె : మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా ఆటల పోటీలు హోరాహోరీగా సాగాయి. హెచ్‌ఎం గౌరీశంకర్ ఆధ్వర్యంలో సాగిన వాలీబాల్ కోకో, కబడ్డీ, బాడ్మింటన్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

డోన్ రూరల్ : గ్రామీణ యువత క్రీడలలో రాణించాలని ఎస్‌జీఎఫ్ డోన్ నియోజకవర్గ కోఆర్డినేటర్ బి.సుధాకర్ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని యు.కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ఆయన ప్రారంభించారు. గ్రామీణ క్రీడాకారులు ప్రతిభను చాటు కోవడానికి మంచి అవకాశమని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

అవమానంతోనే అంతమొందించారు

- హత్యకేసులో తొమ్మిది మంది నిందితుల అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ వెంకట్రామయ్య



హత్యకేసు నిందితులను చూపిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ

కోవెలకుంట్ల: చిన్న విషయంలో జరిగిన అవమానాన్ని సీరియస్‌గా తీసుకుని ఓ వ్యక్తిని హత్య చేశారని ఆళ్లగడ్డ డీఎస్పీ వెంకట్రామయ్య తెలిపారు. శనివారం రాత్రి కోవెలకుంట్ల సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హత్య కేసుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. సంజామల మండలం బొందలదిన్నె గ్రామంలో నవంబర్ 22న వివాహిత చెంచుల జ్యోతి కూరగాయలు కొనుక్కుని నా భర్త పుల్లయ్య ఫోన్‌పే ద్వారా చెల్లిస్తాడని యజమానికి చెప్పింది. అక్కడే ఉన్న ఇదే గ్రామానికి చెందిన నీసు ప్రసాద్ అన్న అయిన నీసు చెన్నయ్యతో నీ మోటార్ సైకిల్ పాతది అయిందని, ప్లాస్టిక్ బిందెలు కొనేవాడికి వేస్తే ఫోన్‌పే కొడతాడని జ్యోతిని చూసి హేళన చేస్తూ మాట్లాడాడు. నాగురించి మాట్లాడుకుంటూ అవమానం చేశారకున్న జ్యోతి ఇంటికి వెళ్లి తన అన్న సుంకేసుల ఏసుదాసు, భర్త పుల్లయ్యకు చెప్పింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని అదే రోజు రాత్రి ఒక వివాహ కార్యక్రమంలో నీసు ప్రసాద్‌పై సుంకేసుల ఏసుదాసు దాడి చేసి రాయితో తలపై కొట్టి గాయపరిచాడు. విషయం తెలుసుకున్న నీసు చెన్నయ్య అలియాస్ కర్ణ ఆ ప్రాంతానికి వస్తుండగా ఏసుదాసు బంధువు రాజేష్ గమనించి చెన్నయ్యపై కూడా దాడి చేశాడు. వీరిద్దరిని కోవెలకుంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందిన తర్వాత వారు తిరిగి ఇంటికి వెళ్లారు. దాడి చేసినా పగ చల్లారకపోవడంతో నీసు ప్రసాదును చంపాలని నిర్ణయించుకున్నారు. ఇదే క్రమంలో అడ్డువచ్చిన వారిని కూడా కడ తేర్చేందుకు సిద్ధమై సుంకేసుల ఏసుదాసు, ప్రవీణ్, వినోద్, రాజేష్, పుల్లయ్య, అనిల్‌బాబు, వంశీ, జ్యోతి, ఓబుళం అనే వ్యక్తులు గొడ్డలి, కట్టెలతో తిరిగి దాడికి ప్రయత్నించారు. ఈ దాడిని అడ్డుకునేందుకు పక్కనే ఉన్న నీసు ప్రసాదుకు బంధువైన నీసు చంద్రశేఖర్(33) ప్రయత్నించాడు. చంద్రశేఖర్‌ను ట్రాక్టర్‌తో ఢీకొట్టారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఈ నెల 21వ తేదీన చంద్రశేఖర్ మృతి చెందాడు. మృతుని భార్య భాగ్యలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు తొమ్మిది మందిపై హత్య కేసు నమోదు చేశారు. కోవెలకుంట్ల సీఐ రామానుజులు, ఎస్ఐ ప్రతాప్ ఆధ్వర్యంలో నిందితులను పట్టణంలోని ముదిగేడు చౌరస్తా వద్ద అరెస్ట్ చేసి వారినుంచి హత్యకు ఉపయోగించిన మారణాయుధాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరుచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు.